విశాలాంధ్ర
విశాఖపట్నం
శుక్రవారం 26, డిసెంబర్ 2025

బోని రోడ్‌లో ట్రాన్స్‌ఫార్మర్ అపహరణ

లబోదిబోమంటున్న రైతులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం బోని రోడ్‌లో వ్యవసాయ ఆధారిత విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్లు రైతులు చెబుతున్నారు. రోడ్డు ప్రక్కనే ఉండడం వల్ల చోరీ చేసినట్లు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌పైనే పలువురు రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, సుమారు మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్దించలేదని, అందువల్ల తరుచు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నందు వల్ల విద్యుత్ శాఖ అధికారులు చొరవ తీసుకొని వెంటనే అక్కడ నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ఇలాంటి ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బడుగులకు అండగా సీపీఐ

జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు

విశాలాంధ్ర - పెందుర్తి: గత వందేళ్లుగా దేశంలో బడుగు బలహీన శ్రామిక వర్గాలకు సీపీఐ అన్ని విధాలుగా అండగా నిలుస్తూ వస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సిపిఐ శతవార్షికోత్సవ వేడుకలు సందర్భంగా జీవీఎంసీ 97 వార్డు గిరి ప్రసాద్ నగర్ పార్టీ కార్యాలయం వద్ద గురువారం ఉదయం పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. స్థానిక సీపీఐ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న సీపీఐ ఆవిర్భవించిందని ఆనాటి నుండి కార్మిక కర్షకులు కోసం ఎన్నో పోరాటాలు చేస్తుందని వెల్లడించారు. దేశంలో చోటు చేసుకున్న ఎన్నో బూర్జువా దోపిడీలను సీపీఐ అడ్డుకుందని తెలిపారు. కార్మికులకు, కర్షకులకు, శ్రామికులకు ఎప్పుడు ఎక్కడ ఎలాంటి అవసరం వచ్చినా అక్కడ సీపీఐ కచ్చితంగా నిలబడేదని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సీపీఐ సాగించిన పోరాటం మరువలేనిదన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లపై సీపీఐ అవిశ్రాంత పోరాటం చేసి విజయం సాధించిందన్నారు. ఆరావళి కొండల్లో బాక్సైట్ తవ్వకాలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేయగా ప్రజాస్వామ్యవాదులతో కలిసి దాన్ని అడ్డుకున్నట్టు వెల్లడించారు. డిసెంబర్ 26న విశాఖలో జరిగే సీపీఐ భారీ ర్యాలీ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

సీపీఐ ప్రదర్శన విజయవంతం చేయండి

విశాలాంధ్ర - మల్కాపురం: సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న సీపీఐ కార్యకర్తలు, సానుభూతిపరులు, కార్మిక నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నగరంలో సరస్వతి పార్క్ నుండి గాంధీ విగ్రహం వరకు జరగబోయే ప్రదర్శనకు హాజరుకావాలని సీపీఐ పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కాంద్రేగుల సత్యాంజనేయ పిలుపునిచ్చారు. నిరంతరం కార్మికుల కోసం కష్టజీవుల కోసం పోరాడే పార్టీని బలపరచాలన్నారు. ఈ సందర్భంగా కాకరలోన, చింతల్ లోవ, క్రాంతి నగర్ తదితర ప్రాంతాల్లో నాయకులు ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, సిపిఐ నాయకులు ఎన్‌వి త్రినాథ్, కే శ్రీనివాస్, డి గోపి, వై.కనకేశ్వరరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి నిత్యాన్న ప్రసాద పథకానికి లక్ష రూపాయలు విరాళంగా భక్తులు సమర్పించారు. విశాఖ, శివశక్తినగర్, శివాజీపాలెం వాస్తవ్యులు కాశిన వెంకటేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో కలిసి నిత్యాన్న ప్రసాద పథకానికి 1,01,116/- విరాళం సీనియర్ గుమాస్తా సూర్యనారాయణలకు అందజేశారు. ఆలయ మర్యాదలు ప్రకారం దాతకు స్వామివారి ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారికి భక్తులు, దాతలు ఏమైనా వస్తువులు, ధన, చెక్కు, డిడి రూపేణా విరాళం ఇచ్చిన సంబంధిత అధికారి వద్ద తగు రసీదు పొందాలని లేదంటే వారు ఇచ్చిన విరాళాలు స్వామివారికి చెందవని అధికారులు తెలిపారు. దాతలకు ఎటువంటి సమాచారం కావాలన్నా 9491000635 నెంబర్‌కు సంప్రదించాలని, లేదంటే నేరుగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిని సంప్రదించాలని అధికారులు పేర్కొన్నారు.

కృత్రిమ మేధాశక్తితో ఆధ్యాత్మికతను జోడిస్తే అద్భుతాలు

విశాలాంధ్ర - భీమిలి: కృత్రిమ మేధాశక్తితో ఆధ్యాత్మికతను సమన్వయం చేసుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చుని పీఠాధిపతి డా. ఉమర్ ఆలీషా సద్గురువర్యులు అన్నారు. గురువారం ఉదయం 9:30 గంటలకు భీమిలి ఆశ్రమం 24వ వార్షికోత్సవ సభ ఆశ్రమ ప్రాంగణంలో పీఠాధిపతి డా. ఉమర్ ఆలీషా అధ్యక్షతన ఎంతో వైభవోపేతంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పీఠాధిపతి ఉమర్ అలీషా సద్గురువర్యులు అనుగ్రహభాషణ చేస్తూ ఆధునిక విజ్ఞానాన్ని ఆధ్యాత్మిక తత్వంతో మేళవించుకొని, మానవత్వపు విలువలతో వయనిస్తే ఆనందమయ జీవితాన్ని పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా శ్రీ పరవస్తు ఫణిశయన సూరి ఆచార్య డి.వెంకట్రావు, సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, శ్రీ ఆచార్య అక్కుభట్ల శర్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అతిథులుగా కలిదిండి గంగరాజు, విశాఖ సమాచారం పత్రిక సూరంపూడి వీరభద్రరావు, ఎస్.సత్యనారాయణ తదితర పుర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధర్యంలో నిరుపేద మహిళలు 40 మందికి దుప్పట్లు, నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఠం సభ్యులు ఎన్టీవీ ప్రసాద్ వర్మ, డాక్టర్ పింగళి ఆనంద్ కుమార్, రమేష్, వి.వి చలం, డివి నారాయణరావు, జయరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గోల్ సాఫ్ట్‌బాల్‌లో వెల్లంకి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - ఆనందపురం: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా గోల్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ (సబ్ జూనియర్స్ - బాలురు, బాలికలు) పోటీల్లో విశాఖపట్నం జిల్లా ద్వితీయ స్థానం సాధించింది. ఈ రాష్ట్రస్థాయి పోటీలు గుంతకల్‌లోని మాంటిసోరి పాఠశాల మైదానంలో నిర్వహించబడ్డాయి. ఈ పోటీల్లో ఆనందపురం మండలం వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు తాతపూడి పూజిత, పడాల ధనలక్ష్మి, గోలగాని శిరీష, మాదాబత్తుల లోహిత, గంగ్రెడ్డి లాస్య ప్రియ, వానపల్లి హర్షిత, మాదాబత్తుల గీతాంజలి తదితరులు నైపుణ్యమైన ఆటను ప్రదర్శించి విశాఖపట్నం జిల్లాను ద్వితీయ స్థానంలో నిలిపారు. విద్యార్థినుల విజయంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ తోనంగి సరిత కీలక పాత్ర పోషించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాడిశెట్టి రమేష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు విజేతలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పీఎంపాలెం శాంతి భద్రతల ఎస్సైగా సంతోష్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - కొమ్మాది: పీఎంపాలెం పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ ఎస్సైగా గంట్యాడ సంతోష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆనందపురం ఎస్సైగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. 2014 బ్యాచ్‌కు చెందిన సంతోష్, గతంలో వన్‌టౌన్, దువ్వాడ, ఆరిలోవ పోలీస్ స్టేషన్లలో ఎస్సైగా సేవలందించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నేటి నుండి వైకుంఠ ద్వార దర్శనం ఆన్‌లైన్ టిక్కెట్లు విక్రయం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి వైకుంఠ ద్వార దర్శనం (ముక్కోటి ఏకాదశి)కి శుక్రవారం నుండి ఈ నెల 29వ తేదీవరకు ఆన్‌లైన్ టిక్కెట్లు విక్రయించనున్నట్టు డిప్యూటీ కమిషనర్, ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారి సుజాత తెలిపారు. ఉచిత దర్శనం, ఆన్‌లైన్ ద్వారా రూ.100, 300, 500 (ప్రత్యేక దర్శనం)లు టిక్కెట్లు లభిస్తాయన్నారు. టిక్కెట్లు కొరకు www.aptemples.ap.gov.in వెబ్‌సైట్, మనమిత్ర మొబైల్ వాట్సాప్ 919552300009 ద్వారా మాత్రమే కొనుగోలు చేయుటకు ప్రత్యేక సౌకర్యం కల్పించుట జరిగిందన్నారు. ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం కొరకు యధా ప్రకారం ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా టిక్కెట్లు దేవస్థానం కౌంటర్ల నందు విక్రయించబడతాయన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



విశాలాంధ్ర - పద్మనాభం: భీమిలిపట్నం మండలం కీటిన్ పేట ప్రాంతంలో నివాసం ఉంటున్న సమ్మిడి ప్రదీప్ తండ్రి సమ్మిడి గడ్డప్ప (63) విద్యుత్ షాకుకు గురై మృతి చెందాడు. కుమారుడు ప్రదీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు కేసు నమోదు చేశారు. తండ్రి గడ్డప్ప మరిడిమాంబ ఆలయం వెనక ఉన్న జిపిఆర్ లేఔట్‌లో గత ఐదు నెలలుగా సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నట్లు తెలియజేశారు. డ్యూటీలో భాగంగా మంగళవారం సాయంత్రం జి పి ఆర్ లేఔట్‌లో విధులు నిర్వహిస్తూ బుధవారం ఇంటికి రావలసిన వ్యక్తి రాకపోవడంతో ఎప్పటిలాగే ప్రదీప్ మామయ్య రాత్రి భోజనం క్యారేజ్ పట్టుకుని వెళ్ళగా, అప్పటికే సమ్మిడి గడ్డప్ప దగ్గర కుడి చేతి వైపు ఒక విద్యుత్ వైరు ఉండి ఆ పక్కనే పడిపోయి ఉన్నాడని తెలిపారు. ప్రదీప్ మామయ్య చుట్టుపక్కల ఉన్న వారిని కేకలు వేయగా వారు వచ్చి పరిస్థితిని చూసి జిపిఆర్ లేఔట్ ఓనర్‌కు ఫోన్ చేసి విషయం తెలియజేయగా ఆయన 108 అంబులెన్స్ ఫోన్ చేసి రప్పించగా డాక్టర్లు పరీక్షించి గడ్డప్ప చనిపోయినట్లు నిర్ధారించారు. సమ్మిడి ప్రదీప్ తన తండ్రి మరణంపై ఎటువంటి అనుమానాలు లేవని కేవలం విద్యుత్ షాకు వల్లే చనిపోయాడని ఫిర్యాదులో పేర్కొనడం జరిగింది. విషయం తెలిసిన స్థానికులు, బంధువులు, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు నిమిత్తం ఎస్సై లలిత ఆదిత్యకు అప్పగించడం జరిగింది.

లోక రక్షకుడు ఏసుక్రీస్తు: ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నగరంలోని ట్రినిటీ లోథరన్ చర్చ్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సిహెచ్.అయ్యన్న పాత్రుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు, క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం క్రైస్తవ సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. క్రిస్మస్ అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అది ప్రేమ, క్షమ, త్యాగం, సేవ అనే విలువలను మన జీవితాల్లో నాటే మహా పర్వదినమని పేర్కొన్నారు. యేసుక్రీస్తు జననం రాజమహల్ లోనో, బంగారు భవనాల్లోనో జరగలేదని, సామాన్యుల మధ్య పశువుల పాకలో ఆయన జన్మించడం ద్వారా అహంకారం కంటే 'వినయం' గొప్పదని ప్రపంచానికి చాటిచెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో వాక్యం అందించడానికి వచ్చిన డాక్టర్ ఎస్.జేసు రత్నకుమార్, చర్చ్ పాస్టర్లు, కన్వీనర్ సుష్ బాబు, కో-కన్వీనర్ వి.ఎన్.మూర్తి, అడ్-హక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ ఉత్తర నియోజకవర్గం 46వ వార్డు శాంతిపురంలో గ్రేస్ బాపిస్టు చర్చ్‌లో బిషప్ పాల్ విక్టర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ క్రిస్మస్ వేడుకల్లో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు పాల్గొని కేక్ కటింగ్ చేసి క్రిస్టియన్ సోదర, సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు బలిరెడ్డి గోవిందరాజు, జక్కంపూడి సత్యనారాయణ, కె.సుకుమార్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు చిన్ని, రాఘవులు, బొట్టా రాజు, గాలి బీమారావు, శ్రీను, ఈశ్వరవు, క్రిస్టియన్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం క్రిస్మస్ సందర్భంగా సబ్బవరం కేథలిక్ చర్చి క్రిస్మస్ వేడుకలలో పాల్గొని బాల యేసుని ముద్దాడిన ఎమ్మెల్యే రమేష్ బాబు క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసారు. ఫాతిమా మాత రోమన్ క్యాథలిక్ చర్చి ప్యారిష్ ప్రీస్ట్ ఫాదర్ ప్రదీప్, కౌన్సిల్ సభ్యులు మాణిక్యాలరావు, ఆదారి నాగరాజు, ఎస్.గణేష్, పాలవెల్లి తదితరులు ఎమ్మెల్యే బృందానికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో క్యాలెండర్ ఇయర్ క్రీస్తు జననాన్ని గుర్తు చేస్తుందని, అప్పటి నుంచి క్రీస్తు శకం, క్రీస్తు పూర్వం అనే విధానం చరిత్ర చెబుతోందన్నారు. కేవలం 33 ఏళ్ళ మాత్రమే జీవించిన క్రీస్తు ప్రభువు, మరియమాత గర్భాన జన్మించి, అప్పటి రాజు ఆంక్షల ప్రకారం శిశువుగా మరణాన్ని తప్పించుకుని, నేనే మార్గం జీవం సత్యం అని శాంతి దూతగా ఎదిగారన్నారు.

ఆయన చేసిన అద్భుతాలు సహించలేని ఆనాటి ప్రభువుల ఆగ్రహానికి సవాలుగా మరణించి మరల పునరుత్థానుడైన ఘనత క్రీస్తు ప్రభువుకే దక్కుతుందని పేర్కొన్నారు. హింసకు తావు లేకుండా కేవలం ప్రజల పట్ల ప్రేమ, దయ, కరుణ మాత్రమే ప్రదర్శించి అద్భుతాలు సాధించిన ప్రభువును కొలుస్తున్న క్రైస్తవులు ధన్యులు అన్నారు. ముఖ్యంగా క్యాథలిక్ క్రైస్తవుల ఆరాధన, క్రీస్తు ప్రభువు తల్లి కన్య మరియ, పవిత్రతను చాటేందుకు మతకన్యలు, గురువులు ఏసుప్రభువుని గుర్తుకు తెచ్చే విధంగా సన్యాసం తీసుకుని ప్రభువు సేవలో తరించటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా చర్చి పారిస్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన నిత్యవసర సరుకులు, చీరలు, కేకులు పండ్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా నిరుపేదలకు పంపిణీ చేశారు. అంతకు ముందు జరిగిన క్రిస్మస్ ప్రార్థనల్లో ఫాదర్ ప్రదీప్ ప్రసంగం చేయగా, బైబిల్ వాక్యాలను సిస్టర్ సోనా, పుష్పాలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం సర్పంచ్ దిద్దం ప్రసాద్, ఎంపీపీ బోకం సూర్య కుమారి, ఎంపీటీసీ బయలుపూడి దేముడు, జనసేన పార్టీ నేతలు కర్రి కనకరాజు, ఇందలి వెంకటరమణ, భరణి కాన సాయినాథరావు, రోమాల చంద్రశేఖర్, బలిరెడ్డి అప్పారావు, సాలాపు వెంకటేశ్వరరావు, బంతి కోళ్ల పద్మ, శేఖర్, బ్రిడ్జి టీన్ సిస్టర్స్ పునీత, విజయప్రభ, సోనా, ఫ్లోరాలు పాల్గొన్నారు.

వన్‌టౌన్: లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని 34వ వార్డ్ కొబ్బరితోట రెల్లి సంఘం నేత మాధవ్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా వాసుపల్లి గణేష్ కుమార్‌కు శాలువా కప్పి క్రైస్తవ సోదరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం క్రిస్మస్ వేడుక కేక్‌ను కట్ చేసి క్రైస్తవ సోదరులకు, వైసిపి కుటుంబ సభ్యులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ శాంతి, సంతోషం, త్యాగం మరియు కరుణకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లండ రమణ, లింగం శ్రీనివాస్, గరికిన వెంకటేష్, దూడ అప్పారావు, సిహెచ్ జ్యోతి, సూరడా లక్ష్మణ్‌రావు (వైట్), దానియమ్మ, అంబతి అప్పలరాజు, ఎస్.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది: జీవీఎంసీ 5వ వార్డు పరిధిలోని కొమ్మాది జంక్షన్, స్వయంకృషి నగర్ 'పెంతెకోస్తు చర్చి', రాజీవ్ గృహకల్ప కాలనీ 'మేరీ టెబెర్నల్ ఫెలోషిప్' చర్చలలో క్రిస్మస్ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో స్థానిక కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ మొల్లి హేమలత ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. యేసుక్రీస్తు బోధించిన శాంతి, ప్రేమ, కరుణ ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాలని ఆకాంక్షించారు. చర్చి పాస్టర్లు బంక అప్పారావు, జిలానీ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సంగ సభ్యులు ఏర్పాటు చేసిన భోజనాలు భక్తులకు వడ్డించి, వృద్ధులకు రగ్గులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక క్రైస్తవ సోదరులు, సోదరీమణులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వంకాయల మారుతి ప్రసాద్, అప్పారావు, గణపతి, పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మను దర్శించుకున్న మంజులా రెడ్డి దంపతులు

విశాలాంధ్ర - పీఎం పాలెం: విశాఖపట్నం జిల్లా మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ శిల్పారామం చైర్ పర్సన్ సి.హెచ్. మంజులారెడ్డి కోటిరెడ్డి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశాఖపట్నం పర్యటనలో భాగంగా స్థానిక శిల్పారామం సందర్శించిన చైర్ పర్సన్ దంపతులు అమ్మవారి ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. వారి వెంట స్థానిక శిల్పారామం అధికారి రమేష్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పట్నాల హరి ప్రసాద్ శర్మ, హరి చరణ్ తదితరులు వేద ఆశీర్వాదం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీదుర్గాలమ్మ ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పోతిన శివ, సభ్యులు పిళ్లా వెంకటరమణ, పొట్నూరి హరికృష్ణ, పోతిన పైడిరాజు, చంద్రంపాలెం గ్రామ పెద్దలు పీస రామారావు, ముఖ్య సభ్యులు పిళ్లా పోతరాజు, జగుపిల్లి అప్పారావు, సుందర శ్రీను, పోతిన రాంబాబు ఉన్నారు.

ఎమ్మెల్యే పంచకర్లను కలిసిన పోలీస్ అధికారులు

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ సబ్ ఇన్స్పెక్టర్లు జిలాని, లక్ష్మీ గురువారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బదిలీపై ఇక్కడికి వచ్చిన ఎస్ఐలు జిలాని, లక్ష్మి పెందుర్తి నియోజకవర్గం సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును కలిసి పుష్పగుచ్ఛమందించి, శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.

అవినీతి అంతంతోనే సుపరిపాలన సాధ్యం

విశాలాంధ్ర - మల్కాపురం: అవినీతిని అంతం చేసినప్పుడే సుపరిపాలన సాధ్యమని జాతీయ సేవా పథకం విశాఖ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక గ్రేటర్ విశాఖ 60, 61 వార్డులలో సెయింట్ ఆన్స్ జూనియర్, డిగ్రీ కళాశాలల జాతీయ సేవా పథకం యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాల రెండవ రోజైన గురువారం సుపరిపాలన దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన వేరు వేరు సదస్సులలో ఆమె మాట్లాడారు. సుపరిపాలన దేశ ప్రగతికి ఎంతో అవసరం అన్నారు. ఉద్యోగులంతా ప్రజా సేవకులుగా, నీతి, నిజాయితీలతో, జవాబుదారీతనంతో, బాధ్యతాయుతంగా, పారదర్శకంగా పనిచేసినప్పుడే దేశం అభివృద్ధిని సాధిస్తుందని, సుపరిపాలన ఏర్పడుతుందని అన్నారు. అనంతరం పల్లి వీధిలోని డిగ్రీ యూనిట్-1 వాలంటీర్లు ఆరోగ్య అవగాహనపై, ప్రియదర్శిని కాలనీలోని డిగ్రీ యూనిట్- 2 వాలంటీర్లు ప్రజల సామాజిక సమస్యలపై, వెంకన్నపాలెంలోని డిగ్రీ యూనిట్- 3 వాలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సర్వేను నిర్వహించారు. 60వ, వార్డులోని జవహర్ నగర్ లో ఇంటర్మీడియట్ యూనిట్- 1 వలంటీర్లు, ఇందిరా కాలనీలోని ఇంటర్మీడియట్ యూనిట్- 2 వలంటీర్లు ప్రజల దైనందిన సమస్యలపై ఇంటింటి సర్వేను నిర్వహించారు. మొత్తం కార్యక్రమాలను సెయింట్ ఆన్స్ కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు భాగ్యలక్ష్మి, అనసూయదేవి, అంజలీదేవి, సంధ్యారాణి, నదియా సమన్వయం చేశారు.

వెంకటాద్రి క్షేత్రంలో పదో రోజు ధనుర్మాస ఉత్సవాలు

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి వెంకటాద్రి పై ధనుర్మాస ఉత్సవాలు పదో రోజు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం 4:30 గంటలకు స్వామివారిని మేల్కొల్పి, హారతి, సేవకాలం, శాత్తుమొర్రై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థ గోష్ఠి వంటి వైది కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. భారీ సంఖ్యలో హాజరైన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ టీటీడీ కలగ మురళీకృష్ణ శర్మచే ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. కాగా ప్రతిరోజు ఉదయం 4:30 గంటల నుండి సేవా కార్యక్రమాలు ఉంటాయని, కొండ దిగువ నుండి ఆలయం వరకు ఉచిత వాహన సదుపాయం ఉంటుందని రామానుజాచార్యులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేసారని ఆలయ కార్య నిర్వహణాధికారి నీలిమ తెలిపారు.

ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్

విశాలాంధ్ర - విశాఖపట్నం: నగరంలోని ఎంవీపీ ఎస్3 స్పోర్ట్స్ అరేనాలో అంతర్జాతీయ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ 2025 గురువారం వైభవంగా ప్రారంభమైంది. శ్రీ చెస్ అకాడమీ, చైతన్య చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఆంధ్ర విశాఖ చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్. బాబురావు, ఎస్3 స్పోర్ట్స్ ప్రతినిధి సహాని చీఫ్ ఆర్బిటర్ జి.వి. కుమార్ జ్యోతి ప్రజ్వలన

చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ చెస్ అకాడమీ డైరెక్టర్ వి. శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో భారత్‌లోని 16 రాష్ట్రాలతో పాటు 5 విదేశాల నుండి మొత్తం 582 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని . వీరిలో 250 మంది అంతర్జాతీయ ఫిడే రేటింగ్ కలిగిన క్రీడాకారులు ఉన్నారన్నారు . ప్రారంభోత్సవం అనంతరం డాక్టర్ రంగాల బాబురావు సహాని మొదటి ఆటను ప్రారంభించారు. రెండో రౌండ్ పోటీలను ఎంవీఎస్ జ్యువలరీ రంగా ప్రారంభించగా, టాప్ సీడెడ్ క్రీడాకారులు తమ విజయ పరంపరను కొనసాగిస్తూ ముందంజలో ఉన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు జరిగే ఈ పోటీలలో విజేతలకు మొత్తం 6 లక్షల రూపాయల నగదు బహుమతితో పాటు, ఆకర్షణీయమైన ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చెస్ ఇన్ స్కూల్స్ మెంబర్ భీమారావు, ఏపీసీఏ సెక్రెటరీ ఎస్. మణికంఠ, శ్రీ చెస్ అకాడమీ డైరెక్టర్ వి. శ్రీకాంత్ పలువురు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలో అనంతవరం పంచాయతీ కేంద్రంలో మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు తమటపు నాగమణి ఆధ్వర్యంలో మండల బిజెపి కమిటీ నాయకులు, కార్యకర్తలు భారత దేశ మాజీ ప్రధానమంత్రి, భారత రత్న, కవి, బహుభాషా కోవిదులు స్వర్గీయ అటల్ బిహారి వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మనాభం మండల బిజెపి అధ్యక్షురాలు తమటపు నాగమణి మాట్లాడుతూ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా భారతదేశాన్ని పరిపాలించి స్వర్ణ చతుర్భుజి పేరుతో దేశంలో నాలుగు ప్రధాన నగరాలను కలుపుతూ జాతీయ రహదారులను అభివృద్ధి చేసి జాతికి అంకితం చేశారన్నారు. అలాగే దేశంలో రైతాంగం అభివృద్ధి చెందాలంటే నదులు అనుసంధాన కర్తగా, గ్రామీణ సడక్ యోజన రూపకర్తగా అలాగే పోక్రాన్ లో అణు పరీక్షలు నిర్వహించి దేశభక్తిని, అభివృద్ధిని చాటి చెప్పి దేశానికి రక్షణగా నిలిచిన నేత మన అటల్ బీహార్ వాజ్పేయి అని అన్నారు. అనుసంధానం రైతాంగం అభివృద్ధి, సంక్షేమంపై మాట్లాడి అందరి మన్ననలు పొందారు. ఈ కార్యక్రమానికి ముందుగా స్వర్గీయ అటల్ బిహారీ వాజ్పేయి చిత్రపటానికి పద్మనాభం మండల భారతీయ జనతా పార్టీ కమిటీ నాయకులు

అధ్యక్షురాలు తమటపు నాగమణి, మండల ఉపాధ్యక్షులు మత్స సోమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు సిరిపురపు వెంకటరావు, కలగర్ల పేర్రాజు, ట్రెజరర్ చప్ప నాగేశ్వరరావు, క్రియాశీల సభ్యుడు చప్ప కృష్ణ, కొవ్వాడ బూత్ కమిటీ అధ్యక్షురాలు పొన్నకాయల లక్ష్మీ కొండ, కార్యదర్శి బోని సింహాచలం (సైకిల్ షాప్ బుజ్జి), కూటమి పార్టీ టిడిపి నాయకుడు, పెంట పంచాయితీ వైస్ ప్రెసిడెంట్ అనుమాలు శెట్టి తాతాజీ, ఎత్తున వృద్ధులు, మహిళలు, అనంతవరం గ్రామ స్థానిక హాస్టల్ విద్యార్థులు, స్థానిక అంగనవాడి పాఠశాల బాల, బాలికలు పాల్గొని పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. స్వర్గీయ దేశ మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని పద్మనాభం బిజెపి మండల కమిటీ నాయకులు అనంతవరం గ్రామ హాస్టల్ విద్యార్థులకు, అంగన్వాడి బాల, బాలికలకు విద్య ఉపకరణాలైన కలర్ పెన్సిల్లు, రబ్బర్లు, అలాగే చాక్లెట్లు, బిస్కెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. అంతేకాకుండా వృద్ధులు, మహిళలకు మహిళలకు ఉచితంగా స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు పద్మనాభం బిజెపి మండల కమిటీ తరఫున అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

అఖిల భారత 18వ మహాసభలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - తగరపువలస: సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డు వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఆటో స్టాండ్ దగ్గర ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్లో స్వతంత్రం అనంతరం ముఖ్యమైన కార్మిక వర్గ పోరాటాలు వాటి అనుభవాలు కార్మిక వర్గం పోరాటాల ద్వారా సాధించిన విజయాలు అన్ని కూడా పొందుపరిచి ఈ ఎగ్జిబిషన్ ద్వారా ప్రజలకి కార్మికులకి తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకు అఖిల భారత సిఐటియు 18వమహాసభలు జయప్రదం చేయాలని, జనవరి 4వ తేదీన విశాఖపట్నం మున్సిపల్

గ్రౌండ్ భారీ ర్యాలీ ప్రదర్శన బహిరంగ సభ జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ మహాసభల ద్వారా ముఖ్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ పోరాటాల ద్వారా కార్మిక వర్గానికి అండగా నిలవడమే ప్రధాన ఉద్దేశం కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్స్ తీసుకురావడం దుర్మార్గమని వెంటనే రద్దు చేయాలని ఈ చట్టం వల్ల కార్మికులు ఎన్నో ఉద్యమ పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులన్నీ కోల్పోతారన్నారు. అవుట్సోర్సింగ్ కాంట్రాక్టర్ కార్మికుల్ని పర్మినెంట్ చేయాలని స్కీం వర్కర్లు అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనాలు 26,000 చెల్లించాలని మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం పేరుని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో పంపాను సూర్యనారాయణ, సిఐటియు మండల అధ్యక్షులు నేలత రాము, పల్ల పెంట రాజు, పల్లా రమణ, నమ్మి నాయుడు, పల్ల పోతురాజు,దుర్గారావు, రమణ, గుజ్జు నరసింహారావు, శ్రీను, మగడ ఈశ్వరరావు, తదితర ముఠా ఆటో కార్మికులు ప్రజలు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఫుడ్ ఫెస్టివల్

విశాలాంధ్ర - పీఎం పాలెం: మధురవాడలోని శిల్పారామంలో వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ అట్టహాసంగా ప్రారంభమైంది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఆహార వేడుకలు స్థానిక సంస్కృతి, రుచులను ప్రతిబింబిస్తాయని అన్నారు. ప్రత్యేక వంటకాలతోపాటు, సందర్శకులను అలరించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు.

ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శం కావాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: క్రిస్మస్ పర్వదినం నేపథ్యంలో క్రిస్మస్ సోదరుల అందరిలో ఏసుక్రీస్తు వెలుగులు నింపాలని, వారి బోధనలో అందరికీ ఆదర్శం కావాలని కోరుకున్నట్లు నగర మేయర్ పీలా శ్రీనివాస రావు పేర్కొన్నారు. గురువారం ఆయన డిసెంబర్ 25 క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పెందుర్తి లోని పెంతుకోస్తు చర్చిలో ఫాదర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ పండుగ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ వేడుకలలో నగర మేయర్ మాట్లాడుతూ మంచి చేయడం, ప్రేమ, దయ, క్షమాగుణం అనేవి బైబుల్ ద్వారా ఏసుక్రీస్తు చెప్పారని, ఈ క్రిస్మస్ పండుగ అందరిలోను వెలుగులు నింపాలని ఆయన తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులే అధికంగా ఉన్నారని, పేదలకు సాయం చేయడంతో పాటు నగర అభివృద్ధికి కలిసిమెలసి స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఆయన కోరారు. క్రిస్మస్ ఫెస్టివల్ అనేది అందరికీ సాయపడడమేనని అని ఆయన అభివర్ణించారు. ప్రపంచ దేశాల్లోనే శత్రువుల్ని కూడా ప్రేమించండి అని యేసు ప్రభువు చెప్పిన వాఖ్యల్ని గుర్తు చేశారు. ఈ వేడుకలకు చర్చిలోని ఫాదర్ కేక్ కట్ చేయించి మేయర్ తో పాటు అందరికీ పంచి పెట్టారు. ఏసుక్రీస్తు వారి స్తోత్రములు, సూక్తులను చదివి వినిపించారు. పెంతుకోస్తు చర్చ్ ఫాదర్ ప్రసాద్ ఏసుక్రీస్తు బోధనలు, సువార్తలను అందరికీ బోధించి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెంతుకోస్ట్ చర్చ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఎం నేత అప్పలరాజుపై పిడియాక్ట్ రద్దు చేయాలి

విశాలాంధ్ర - వన్‌టౌన్: బల్క్ డ్రగ్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజుపై పిడి యాక్ట్ పెట్టి అరెస్టు చేయడానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కే.లోకనాథం తీవ్రంగా ఖండించారు. తక్షణమే అప్పలరాజును బేషరతుగా విడుదల చేయాలని లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని రాష్ట్ర కూటమి ప్రభుత్వానికి హెచ్చరించారు. గురువారం సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగదంబ సెంటర్లో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి ప్రజల కోసం అప్పలరాజు సిపిఎం పార్టీ కార్యదర్శ వర్గ సభ్యుడుగా, రైతు సంఘం జిల్లా కార్యదర్శిగా రైతు సమస్యల మీద పోరాడుతున్న అప్పలరాజుపై రాష్ట్ర ప్రభుత్వం 19 అక్రమ కేసులు పెట్టిందని, ఈ 19 కేసులకు సంబంధించిన దాంట్లో 13 కేసులు కోర్టు రద్దుచేసి మరల కేసు పెట్టడం సరైనది కాదు అన్నారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు ఇంటి దగ్గరకు వందలాదిమంది పోలీసులు వెళ్లి పిడి యాక్ట్ పెడుతున్నామని, నువ్వు వెంటనే లొంగిపోవాలని చెప్పి ఇంటి వద్ద అక్రమంగా అరెస్టు చేశారన్నారు. చట్టానికి నేను భిన్నంగా వ్యవహరించలేదు, చట్టం ఆమోదంగానే మీరు పర్మిషన్ ఇచ్చిన దాంట్లోనే పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించానని చెప్పినా పోలీసులు వినలేదు . ప్రధానంగా బల్క్ డ్రగ్ వస్తే మత్స్యకారులు, కూలీల ఉపాధి పోవడమే కాదు ఆ ప్రాంత పర్యావరణం దెబ్బ ఉంటుందని కోరడమే అయిన చేసిన తప్పా అని ప్రశ్నించారు. సీటు నేత సిహెచ్ నరసింహారావు మాట్లాడుతూ పిడియాక్ట్ ఎవరి మీద పెట్టాలి? గంజాయి, ఎర్రచందనం స్మగ్లర్ల మీద పెట్టాలన్నారు. లేదా భూ తగదాల్లో తలదూర్చి వేలాది కోట్ల రూపాయలు సంపాదిస్తున్న వాళ్ల మీద పెట్టాలి. వైట్ కలర్ నేరాలు చేసే వాళ్ల మీద పెట్టాలి అనేది చట్టం స్పష్టంగా చెప్పిందన్నారు. అలాంటి యాక్ట్ ప్రజా ఉద్యమాలు చేసే అప్పలరాజు మీద పెట్టడం అన్యాయం అని అన్నారు. జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రజలకు హక్కులు లేవు అని గగ్గోలు పెట్టారన్నారు. అధికారం ఇవ్వండి ప్రజాస్వామ్య పాలన చేస్తాం అని హామీ ఇచ్చారు. చేయరా అధికారం చేపట్టిన తర్వాత ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్నారు హక్కులను కాల రాస్తున్నారు అని ఈ ఘటన నిరూపిస్తుంది. బల్క్ డ్రగ్ వల్ల మత్స్యకారులు ఉపాధి పోతుంది ప్రజలు రోగాల బారిన పడతారని ఆందోళన చేస్తుంటే ఆ పరిశ్రమ ను నిషేధించాల్సింది పోయి కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారు ప్రజల పక్షాన పోరాడుతున్న అప్పలరాజుని అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఆర్కే ఎస్‌వి కుమార్, పి.మణి, బి.పద్మ, వి.కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వరమ్మ, ఎం.సుబ్బారావు, పి.పైడిరాజు, ఆర్ ఎస్ ఎన్ మూర్తి, యుఎస్ఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలోకి సృష్టికర్త ఆగమనమే.. క్రిస్మస్

-స్నేహితుల క్రిస్మస్ వేడుకలో యూఈఎస్ఐ ప్రతినిధి రవి కుమార్

విశాలాంధ్ర - విశాఖపట్నం: సృష్టికర్త తానే స్వయంగా మానవ చరిత్రలోకి మానవుడిగా రావడమే క్రిస్మస్ పండగ అంతరార్థమని యూనియన్ ఆఫ్ ఎవాంజలికల్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా(యూఈఎస్ఐ) రాయలసీమ ప్రతినిధి ఆర్.రవికుమార్ అన్నారు. రేసపువానిపాలెంలోని క్వర్క్ మెమోరియల్ బాప్టిస్టు (క్యూఎంబీ) చర్చి పాలకమండలి ఆధ్వర్యంలో స్నేహితుల క్రిస్మస్ వేడుకగా జరిగింది. క్రిస్మస్‌కు ఒకరోజు ముందు ఈ సంఘానికి చెందిన విశ్వాసులు, కుటుంబీకులు ఇతర విశ్వాసాలకు చెందిన తమ స్నేహితుల్ని ఆహ్వానించి వారితో కలసి ఈ వేడుక నిర్వహించడం గత కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ ఆనవాయితీ. ఈ ఏటి స్నేహితుల క్రిస్మస్ అతిథి వక్తగా హాజరైన రవికుమార్ యేసుక్రీస్తు పుట్టుక ఎందుకు ప్రపంచమంతా పండగ వాతావరణం నెలకొంటుంది? అది ఏవిధంగా మనకందరికీ ఉపయోగపడుతుంది? అనే ప్రశ్నతో ఆయన ప్రసంగాన్ని ప్రారంభించి పలు చారిత్రకాంశాలు, వాస్తవాలను ప్రస్తావించారు. సీబీఎస్ఈ ఆరోతరగతి పాఠంలో బస్ కండక్టర్ టు ఫిలింస్టార్ పాఠాన్ని ప్రస్తావిస్తూఅపరకోటీశ్వరుడైనా రజనీకాంత్ మనశ్శాంతికోసం, తన ఆనందం కోసం ఏటా రెండు సార్లు హిమాలయాలకు వెళ్తుంటాడని చెప్పారు. క్రీస్తు శకం 53వ సంవత్సరంలో యేసు శిష్యులో ఒక డైన సెయింట్ తోమా (థామస్) భారత దేశానికి వచ్చి క్రీస్తు సువార్తను ప్రకటించాడని ఆయన హతసాక్షి అయినట్టు చెన్నైలో ఆయన సమాధి ఇతర ఆధారాలు ఎన్నో మన భారతదేశం క్రీస్తు చూపిన సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన మిషన్ అమరత్వ పలు సాంస్కృతిక ప్రదర్శనలు హృదయాలను తాకాయి. విశేష సంఖ్యలో హాజరైన సందర్శకులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

క్రైస్తవులు క్రీస్తును పోలి నడచుకోవాలి

- క్యూఎంబీ చర్చ్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: క్రైస్తవులు తమ ప్రవర్తన, స్పందన, ప్రతిస్పందన విషయంలో క్రీస్తును పోలి నడచుకోవాలని యూనియన్ ఆఫ్ ఇవాంజిలికల్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా తిరుపతి ప్రతినిధి ఆర్. రాజ్ కుమార్ ఉద్బోధించారు. క్రిస్మస్ సందర్భంగా గురువారం ఉదయం క్వర్క్ మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో జరిగిన ఆరాధనలో ఆయన ముఖ్య ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుని అనంతమైన ప్రేమలో స్వార్థం లేదు. ప్రేమించడంలో క్షమించడం మానవాళికి మాదిరి చూపడానికే యేసు క్రీస్తు మనుష్య కుమారుడిగా ఈ లోకానికి వచ్చారన్న వాస్తవాన్ని ప్రతిఒక్కరూ గుర్తెరగాలన్నారు. చిన్న చిన్న కారణాలతో ప్రజలను ప్రేమించడం మానేస్తే నీ చుట్టూ ఎవరూ మిగలరనే వాస్తవాన్ని గమనించాలని రాజ్ కుమార్ సూచించారు. మార్కు సువార్త ప్రకారం ఒక కుష్ఠరోగి యేసు దగ్గరకు వచ్చి నీకిష్టమైతే నన్ను శుద్ధుడిగా చేయమన్న దృష్టాంతాన్ని, మోషే ధర్మశాస్త్ర ప్రకారం వ్యభిచారం చేస్తూ పట్టుబడ్డ స్త్రీని రాళ్లు రువ్వి చంపాలనుకున్న జనం మధ్య మీలో పాపం లేని వారు తొలి రాయి వేయమని చెప్పినపుడు అంతా రాళ్లు వదిలి వెళ్లిపోయిన ఘటన, యేసు కూడా ఆమెను క్షమించిన సంఘటన గుర్తు చేశారు. సీనియర్ సంఘకాపరి డాక్టర్ జి. స్టీవెన్ పీటర్, అసోసియేట్ పాస్టర్ జె. చార్లీ మోజెస్ క్రిస్మస్ ఆరాధనలు నడిపించారు. సంఘ అధ్యక్షులు టి. ఐజక్ అందరికీ శుభ సందేశాలనందజేశారు. దేశ విదేశాల నుంచి హాజరైన పలువురు భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

ప్రేమతో పండుగ, ఐక్యతతో ఆనందం

శ్రీ సత్యసాయి విద్యా విహార్‌లో వైభవంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి ఈ శాశ్వత ప్రేమ, ఐక్యత సందేశాన్ని ప్రతిబింబిస్తూ, శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో క్రిస్మస్ 2025 వేడుకలు అత్యంత ఆనందం, భక్తి, ఐక్యతా భావంతో ఘనంగా నిర్వహించబడ్డాయి. నక్షత్రాలు, దీపాలు, ఆకర్షణీయమైన చార్టు మరియు అందంగా అలంకరించిన క్రిస్మస్ చెట్టుతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ వేడుకలలో భాగంగా 8వ తరగతి విద్యార్థులు 20 డిసెంబర్ నుండి 24 డిసెంబర్ 2025 వరకు పాఠశాల అసెంబ్లీల సమయంలో నాలుగు రోజులపాటు

అర్థవంతమైన, ఆనందభరిత క్రిస్మస్ కార్యక్రమాలను నిర్వహించారు. క్రిస్మస్ కీర్తనలు, ఉత్సాహభరిత నృత్యాలు, ఆటలు మరియు ఆలోచనాత్మక నాటికల ద్వారా సానుభూతి, పంచుకోవడం, సహాయం చేయడం, పేదల సేవ వంటి విలువలను అద్భుతంగా ఆవిష్కరించారు. నాలుగో రోజు కార్యక్రమం ప్రాథమిక తరగతుల చిన్న శాంతాక్లాస్, దేవదూతలు (ఏంజెల్స్) లతో మరింత మధురంగా ముగిసింది. క్రిస్మస్ సందర్భంగా 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలోని ప్రేమ్ సదన్ మందిరంలో

సాయంత్రం నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ప్రాథమిక విద్యార్థులు శాంతాక్లాస్, దేవదూతలుగా అలంకరించుకొని అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ పండుగ ఆనందాన్ని పంచారు. విద్యార్థులు ఆలపించిన భక్తి గీతాలు మరియు క్రిస్మస్ కీర్తనలు, భక్తులను, హాజరైన వారందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల ద్వారా విద్యార్థులు కరుణ, సామరస్యం, కృతజ్ఞత భావం మరియు సర్వమత గౌరవం వంటి విలువలను హృదయపూర్వకంగా ప్రతిబింబించారు. విద్యార్థులు, సిబ్బంది కలిసి సర్వమత భజనలు, కీర్తనలు ఆలపించి ఐక్యతా సందేశాన్ని మరింత బలంగా చాటారు. ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, అలాగే విశాఖ జిల్లా శ్రీ సత్య సాయి సేవా సంస్థల అధ్యక్షులు, అనేక మంది భక్తులు, పదాధికారులు కూడా పండుగలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఫోటోగ్రాఫర్, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ కార్యదర్శిగా సంతోష్ కుమార్

విశాలాంధ్ర - ఆనందపురం: విశాఖ జిల్లా ఫోటోగ్రాఫర్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ సెక్రటరీగా భీమిలి మండలం తాళ్లవలసకు చెందిన సంతోష్ వీడియోస్ అధినేత సంతోష్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నం పూర్ణ మార్కెట్ సమీపంలోని థియేటర్‌లో నూతన కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి జనసేన నాయకులు వంశీకృష్ణ, జర్నలిస్టు నాయకులు గంట్ల శీను బాబు పాల్గొన్నారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్, వీడియో గ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న

కొందరు ఫోటోగ్రాఫర్లకు సహాయం అందించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో సంఘ సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా మట్టా లోకేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా చెల్ల నూకరాజు, కార్యదర్శిగా విజ్జపు సంతోష్ కుమార్తో పాటు మరో 40 మంది కార్యవర్గ సభ్యులు వివిధ పదవులకు అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ సంఘ సభ్యులు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ఫోటోగ్రాఫర్ వీడియో గ్రాఫర్ల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపకులు కేశవరావు, గంగాధర్, శ్రీ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జనవరి 4న కల్లుగీత ఉపకులాల వనసమారాధన

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం ఆనందపురం గ్రామం టిసిఎస్ పరిధి 24 కాలనీలో జనవరి 4వ తేదీన ముడసార్లోవ పార్కులో జరగబోవు కల్లుగీత ఉపకులాల వన సమారాధన, ఆత్మీయ కలయిక కొరకు ఆనందపురం నుండి అధిక సంఖ్యలో వచ్చేందుకు సంఘీభావం తెలియజేశారు. వర్ధిల్లాలి గీత కార్మికుల ఐక్యత అని నినాదాలు చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగటి రాము, కుప్ప రామలక్ష్మి, కుప్ప గురువులు, కుప్ప అప్పలరాజు, గండిబొయిన రమణ, చెంచునాయుడు, ముడసల శ్రీను, ముత్యాల నాయుడు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



కళారూపాలకు వేదికగా విశాఖ: మాజీ మంత్రి గంటా

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ కళారూపాలకు వేదికగా మారుతుందని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మద్దిలపాలెం, కళాభారతిలో జరిగిన కన్యాశుల్కం నాటక ప్రదర్శనను ముఖ్యఅతిథిగా విచ్చేసిన గంటాతో పాటు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ప్రముఖులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. గంటా ప్రసంగిస్తూ విశాఖలో నాటకాల ప్రదర్శనకు కళా వేదిక లేని లోటు తీర్చాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ లోని రవీంద్ర భారతి మాదిరిగా ఒక వేదిక ఇక్కడ కూడ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సీనియర్ కళాకారులను గుర్తించి నగదుతో వారిని రైటర్స్ అకాడమీ సత్కరించడం అభినందనీయం అన్నారు. నిర్వాహకులు రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి మాట్లాడుతూ ప్రతి ఏడాది రైటర్స్ అకాడమీ, లీడర్ సంయుక్తంగా తల్లి విల్లూరి రాములమ్మ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపడుతున్నామని 2017లో

ప్రజా కవి వంగపండుకు, తర్వాత సీనియర్ పాత్రికేయులు ఏబీకె ప్రసాద్, తదితరులకు జీవిత సాఫల్య పురస్కారం కింద రూ.1 లక్ష అందజేశామన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా సీనియర్ నటులు బగాది వెంకట అప్పలనాయుడు, బొట్టా వేణుగోపాలరావు, నక్కా పట్టాభి రామారావు, కె.మంగాదేవి సేవల్ని కొనియాడుతూ జీవిత సాఫల్య పురస్కారాలతో పాటు రూ.25వేలు చొప్పున నగదును అందజేశారు. కళాభారతిలో గురువారం నిర్వహించిన 'కన్యాశుల్కము' సంక్షిప్త నాటక ప్రదర్శన అందర్నీ అలరించింది. మహాకవి గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకానికి సంక్షిప్తంగా పేరి రవికుమార్ దర్శకత్వంలో ప్రదర్శించిన కన్యాశుల్కం నాటకాన్ని చూసిన ప్రేక్షకులు చప్పట్లతో హోరెత్తించారు. కన్యాశుల్కం ప్రదర్శనను రైటర్స్ అకాడమీ అధ్యక్షులు, 'లీడర్' ఎడిటర్ వీవీ రమణమూర్తి, సంచాలకులు మేడా మస్తాన్ రెడ్డి పర్యవేక్షించారు. దాడి వీరభద్రరావు, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ప్రేమ సమాజం మాజీ చైర్మన్ బుద్ధ శివాజీ, పద్మ పూజిత ఆటో ఫైనాన్స్ చైర్మన్ బసవరాజు, సన్ ఇంటర్నేషనల్ శ్రీకాంత్, కళాభారతి అధ్యక్షులు ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి జి ఆర్ కే ప్రసాద్, సిరి ఆటో ఫైనాన్స్ శ్రీనివాస్, పైడా కృష? ప్రసాద్, విజయ నిర్మాణ సంస్థ అధినేత విజయ్ కుమార్, వంకాయల శ్రీరామ్, ఏవీ రమణ, ప్రముఖులు, కళాభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిరుపేదలకు రగ్గులు పంపిణీ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో వెల్లంకి బిజేపి పార్టీ కార్యాలయంలో ఘనంగా మాజీ ప్రధాని అటల్ బీహారి వాజ్‌పేయి 101వ జయంతి వేడుకలు బిజేపి మాజీ విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్, బిజేపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు, మండల పార్టీ అధ్యక్షురాలు విజయ, జిల్లా కార్యవర్గ సభ్యులు మీసాల రాము నాయుడు మెడికల్ సెల్ కన్వీనర్ కె.వి.ఎన్.కృష్ణా రావు (గోపి) ఆధ్వర్యంలో జరిగాయి. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆనందపురం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలింతలకు, వృద్ధులకు, జాతీయ రహదారి ప్రక్కన నివసించే వృద్ధులకు 150 రగ్గులు పంపిణీ చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయి భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకులుగా, మన

దేశానికి 3 సార్లు ప్రధానమంత్రిగా సేవలు అందించి, జాతీయ రహదారులను అభివృద్ధి చేసి జాతికి అంకితం చేశారన్నారు. విశాఖ జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి డి.పి.జె. వెంకటరత్నం(డి.పి.రాజు), విశాఖ జిల్లా ఓబీసీ నాయకులు ఇల్లి పిల్లి వెంకట్ (వర్షం వెంకట్), శ్రీ శుభ బలరాం చారిటబుల్ సేవ ట్రస్ట్ వ్యవస్థాపకులు వి.జాని కేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు అడ్డూరు సురేష్, పోతిన జీవన్ సంతోష్, మాధ బత్తుల బుజ్జి, మండల ట్రెజరర్ గంధ్రెడ్డి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు సీరపు రామలక్ష్మి, నీటి సంఘం డైరెక్టర్ కొలిచి శ్రీను, బిజేపి నాయకులు బోర శ్రీను, కె.వి.వి.సూర్యనారాయణ, పాండ్రంకి గోవింద, నిమ్మకాయల అప్పలరాజు, ఉప్పాడ శివ, తాటిశెట్టి బాను, పొన్నాడ గురయ్య, దుర్గ సత్యనారాయణ, మండల ప్రాథమిక సిబ్బంది పాల్గొన్నారు.

బాధితురాలినే నిందితురాలిని చేశారు

వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: కూటమి ప్రభుత్వం బాధితురాలినే నిందితురాలిని చేసిన దుర్మార్గపు పాలన సాగిస్తుందని వైఎస్ఆర్సిపి మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మంత్రి గుమ్మడి సంధ్యారాణి డైరెక్షన్ లోనే పోలీసుల విచారణ జరిపి, అధికార పార్టీ కార్యకర్తల్లా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న పోలీస్ వ్యవస్థ సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆక్షేపించారు. మీ పీఏ బాధితురాలి దగ్గర డబ్బు తీసుకోలేదా? లైంగికంగా వేధించిన మాట వాస్తవం కాదా? అని మంత్రి సంధ్యారాణిని ప్రశ్నించారు. బాధిత మహిళలకు న్యాయం చేయాలని లేనిపక్షంలో వైయస్సార్సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిందితుడితో పాటు, అతడికి సహకరించిన పోలీసులకూ చట్టపరంగా శిక్ష తప్పదని హెచ్చరించారు.